క్లుప్తంగా

వైభవంగా అంకమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవం



పెదకూరపాడు: పెదకూరపాడులోని బస్టాండ్ సమీపంలో వేంచేసియున్న అంకమ్మతల్లి 23వ వార్షికోత్సవం గత రెండు రోజులుగా ఘనంగా నిర్వహించారు. గురువారం అమ్మవారికి 108 బిందెలతో జలాభిషేకం, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, గ్రామోత్సవం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పొంగళ్లు చేశారు. అంకమ్మతల్లి భజన సమాజం ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

క్రోసూరు: ఎస్టీయూ క్రోసూరు మండల శాఖ గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాతులూరి రాఘవ తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. పెండింగ్ బకాయిలను సాధించేందుకు పోరాడుతున్నట్లు తెలిపారు. సంఘం ప్రతినిధులు జి.సదాశివారెడ్డి, టి.పాతయ్య, ఉమాదేవి, ఎం.రవికాంత్‌రెడ్డి, కె.రవికుమార్ పాల్గొన్నారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ మట్టి సేకరణ

క్రోసూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని 18 పంచాయతీల నుంచి మట్టి సేకరించినట్లు ఎంపీడీఓ బి.మహేష్ తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఒక కలశంలో బియ్యం, మరొక దాంట్లో మట్టి సేకరించి మండల పరిషత్ కార్యాలయంలో భద్రపరిచినట్లు తెలిపారు. త్వరలో ఈ కలశాలను దేశ రాజధాని ఢిల్లీకి పంపనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, వెలది అప్పారావు, విస్తరణాధికారి పి.శివరామయ్య, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం విజ్ఞానానికి దోహదం



పెదకూరపాడు: లగడపాడు ఎంపీపీఎస్ పాఠశాలలో ఎన్నారై సంస్థ వాసవి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ లైబ్రరీని ఎంఈఓ ఏకుల ప్రసాదరావు, గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏకుల ప్రసాదరావు మాట్లాడుతూ పుస్తక పఠనం విజ్ఞానానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఎన్నారై సంస్థ అందిస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. హెచ్ఎంలు వెంకటరమణ, శివనాగేశ్వరరావు, ఎస్తేరురాణి, ప్రసాద్, ఉపాధ్యాయుడు రాయపూడి సాంబశివరావు, మీరమ్మ పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం

సత్తెనపల్లి: ప్రతిఒక్కరూ నేత్ర పరీక్షలు చేయించుకోవాలని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల అడ్మినిస్ట్రేటర్ జె.పాపయ్య చెప్పారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని 16వ వార్డు చెంచు కాలనీలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ అంధత్వ నిర్మూలనలో భాగంగా అందరూ కూడా కళ్లను కాపాడుకోవాలని, షుగర్ వ్యాధిని నియంత్రించుకోవాలన్నారు. 141 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, 72 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 16వ వార్డు మాజీ కౌన్సిలర్ నందిగం ఆదాం, విజన్ సెంటర్ కో–ఆర్డినేటర్ బి.మల్లేష్, జూనియర్ అడ్మినిస్ట్రేటర్ వై.సత్యనారాయణ, ఫ్రెండ్స్ సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు తోట ఆంజనేయులు పాల్గొన్నారు.

మాతృభూమి రుణం తీర్చుకోవాలి



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న మాగులూరి ఫౌండేషన్ సభ్యులు

పెదకూరపాడు: మాతృభూమి రుణం తీర్చుకునేందుకు ఎన్ఆర్ఐలు ముందుకు రావాలని పలువురు పేర్కొన్నారు. మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకుడు కృష్ణారావు ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్ జన్మదినం సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంబీఏ విద్యార్థి పి.మనీషా, వెంకయ్య స్వామిలకు ల్యాప్‌టాప్‌లు, 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించి స్టడీ మెటీరియల్, ఐటీఐ కళాశాల విద్యార్థి జి.నాగేంద్రబాబుకు రూ. 10వేలు ఆర్థికసాయం, స్వామికి తోపుడు బండిని ఫౌండేషన్ ద్వారా అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు కె.కిరణ్‌కుమార్, కె.ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆనందం ఇంటింత కాదయా..!

- పండుగ వాతావరణంలో సామూహిక గృహప్రవేశాలు
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



సభలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాజీ డిప్యూటీ మేయర్ మురళి, కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పన, చల్లంచర్ల, గాదె సుజాత

సత్తెనపల్లి: పేదల సొంతింటి కలను రాష్ట్రప్రభుత్వం సాకారం చేస్తుంది. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా పక్కా గృహాలు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి మూడు విడతల్లో రూ.1.80 లక్షలను ఇస్తుంది. డబ్బు లేని లబ్ధిదారులకు వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా రూ.35 వేలు రుణం ఇప్పిస్తోంది. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను రాయితీపై అందజేస్తోంది. అంతేకాకుండా కాలనీలో విద్యుత్, రోడ్లు, మంచినీరు, తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. దీంతో లబ్ధిదారులు రెట్టింపు ఉత్సాహంతో ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల సమీపంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో 1,243 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా 1,150 గృహాలు మంజూరయ్యాయి. 234 గృహాలు పూర్తయ్యాయి. 82 గృహాలు శ్లాబులు పూర్తికాగా 53 గృహాలు శ్లాబ్ మట్టానికి చేరుకున్నాయి. 611 గృహాలు బేస్మెంట్‌కు చేరుకోగా 169 గృహాలు నిర్మాణానికి గుంతలు తీశారు. సామూహిక గృహ ప్రవేశాలల్లో భాగంగా గురువారం రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పన, ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారితో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై పండుగ వాతావరణంలో పేదల పక్కా గృహాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.



గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు



గృహాన్ని ప్రారంభిస్తున్న నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు



గృహాన్ని ప్రారంభిస్తున్న ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గాదె సుజాత

జగనన్న మేలును ఎన్నటికీ మరువం



నా భర్త సూరే రామారావు కొట్టులో గుమస్తాగా పనిచేస్తుంటాడు. మాకు ఒక కుమార్తె ఉంది. సొంతిల్లు లేక నెలకు రూ.3 వేలు చెల్లించి అద్దె ఇంట్లో నివసిస్తున్నాం. ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దయతో ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు సొంత ఇల్లు కూడా మంజూరు చేశారు. ఇప్పుడు గృహప్రవేశం చేయడం ఎంతో ఆనందంగా ఉంది. జగనన్న మేలును ఎప్పటికీ మరువను. ఇబ్బందుల నుంచి ఎట్టకేలకు బయటపడ్డాం.

– సూరే నాగలక్ష్మి కుమారి, సత్తెనపల్లి

పుట్టిన, మెట్టిన ఇంటి నుంచి ఏమీ రాలేదు..



నా భర్త లక్ష్మణరావు ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. నేను వలంటీర్‌గా పనిచేస్తూ జీవనం వెళ్లదీస్తున్నాం. సొంతిల్లు కట్టుకోవాలనేది మా కల. ఆ కల సీఎం జగనన్న నెరవేర్చారు. పుట్టిన ఇంటి నుంచి, మెట్టిన ఇంటి నుంచి నాకు ఏమీ రాలేదు. కానీ నాకు జగనన్న ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలం, పక్కా ఇంటితో పాటు రైస్‌కార్డు కూడా వచ్చింది. మా కుటుంబం ఎప్పటికీ జగనన్న చేసిన మేలును మరువదు.

– ఏవీ శివనాగలక్ష్మి, సత్తెనపల్లి

క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తే కఠిన చర్యలు



సత్తెనపల్లి: నియోజకవర్గంలోని సత్తెనపల్లిరూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రేమయ్య హెచ్చరించారు. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఉత్తర్వుల మేరకు క్రికెట్ బెట్టింగ్‌లు, లాటరీలు, సింగిల్ నెంబర్లు, పేకాట వంటి వాటిపై ఉక్కుపాదం మోపామన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచటం జరుగుతుందన్నారు.

అంబేడ్కర్ నగర్ కాలనీలో ట్రైనీ కలెక్టర్ పర్యటన

రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెం పరిధిలోని అంబేడ్కర్ నగర్‌కాలనీని పల్నాడు జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మౌలిక వసతులపై కాలనీవాసులతో మాట్లాడారు. గతంలో స్పందన కార్యక్రమంలో కాలనీవాసులు రోడ్లు లేవని, ఎస్ఎస్పీ కాలనీపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, ముఖ్యంగా పాఠశాలను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు. దీనిలో భాగంగా ట్రైనీ కలెక్టర్ సర్పంచ్ రామాంజనేయులుతోను, స్థానిక అధికారులతో కలసి కాలనీలోని వసతులపై ఆరా తీశారు. పాఠశాలను వచ్చే ఏడాది ఏర్పాటు చేస్తామని, త్వరలో బ్రిడ్జిని నిర్మిస్తామని తెలిపారు. తాగునీటి వసతికూడా కల్పిస్తామని తెలిపారు. తహసీల్దార్ ఉన్నీస్సాబేగం, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంఈఓ మల్లికార్జున శర్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్‌కు ప్రగతి విద్యార్థి ఎంపిక



భానుప్రకాష్‌ను అభినందిస్తున్న డాక్టర్ మక్కెన అచ్చయ్య, పద్మజా, షఫీ

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో బుధవారం జరిగిన క్రికెట్ అండర్ –14 విభాగంలో సత్తెనపల్లి పట్టణంలోని ప్రగతి సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థి మర్రి భానుప్రకాష్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ షఫీ తెలిపారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో భాను ప్రకాష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రగతి సీబీఎస్సీ పాఠశాలలోని న్యూ క్రికెట్ క్లబ్ నెట్‌లో ప్రాక్టీస్ చేస్తూ కోచెస్ కృష్ణ, గంప శ్రీనివాసరావు, దాదావలి వద్ద తర్ఫీదు పొంది మెలకువలు నేర్చుకొని ఎంపికల్లో ప్రతిభ ప్రదర్శించి గుంటూరు జిల్లా అండర్ –14 తరఫున ఎంపికయ్యాడన్నారు. నవంబర్‌లో నంద్యాలలో జరిగే 67వ స్కూల్ గేమ్స్ అండర్ –14 క్రికెట్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు జిల్లా తరఫున భానుప్రకాష్ ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. ప్రగతి సీబీఎస్ఈ స్కూల్ చైర్మన్ డాక్టర్ లయన్ మక్కెన అచ్చయ్య, స్కూల్ కరస్పాండెంట్ మక్కెన పద్మజలు అభినందించారు.

బాలికల హక్కులను కాపాడాలి



అమరావతి వీధులలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అమరావతి: బాలికల హక్కులను పరిరక్షించాలని పలువురు నినదించారు. స్థానిక గుడ్‌షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్ఐ ఎస్‌కే మహమ్మద్ సుభాని, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్ఐ సీహెచ్ అల్లురెడ్డి, ఫాదర్ భాస్కర్ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ర్యాలీ అంబేడ్కర్ విగ్రహం దగ్గర ప్రారంభమై మద్దూరుడౌన్ సెంటర్, దుర్గావిలాస్ సెంటర్, గాంధీబొమ్మ సెంటర్‌వరకు బాలికల హక్కుల కోసం నినాదాలు చేస్తూ సాగింది. ఈ ర్యాలీలో అగస్టీన్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఝాన్సీ, గుడ్‌షెఫర్డ్ కాన్వెంట్ డైరెక్టర్ సిస్టర్ విన్నారసి, పల్లోటి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, సిస్టర్ గ్రేసి అగస్టీన్, హైస్కూల్ విద్యార్థులు, పల్నాటి జూనియర్ కాలేజీ విద్యార్థులు, ఉపాధ్యాయులు గుడ్ షెఫర్డ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా ఉద్యానశాఖ అధికారి బీజే బెన్నీ



షేడ్‌నెట్లను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

క్రోసూరు: మిర్చి రైతులు తమ పంటలపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి బీజే బెన్నీ పేర్కొన్నారు. గురువారం మండలంలో ఎర్రబాలెం, క్రోసూరు గ్రామాల్లో మిర్చి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా కొత్తగా వేసిన షేడ్‌నెట్‌లను పరిశీలించి వాటి యజమానులకు సూచనలు చేశారు. అదేవిధంగా ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల వల్ల బెట్ట రానీకుండా అవసరమైనపుడు తడులు ఇవ్వాలని తెలిపారు. మిరప పంటలకు సరైన మోతాదులో ఎరువులు, పురుగుమందులు వాడాలన్నారు. ఉద్యానపంటలలో నీటివసతులున్న రైతులకు నీటి యాజమాన్యం కోసం ఏపీ ఎంఐపీ ద్వారా చిన్న,సన్నకారు రైతులకు 90 శాతం డ్రిప్, 55శాతం స్ప్రింకర్లు, ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉద్యానశాఖ ద్వారా 20ఎంటీ బై 20 ఎంటీ బై 3 ఎంటీ నీటి కుంటలకు పట్ట వేసుకుంటే రూ.75 వేలు రాయితీ ఇస్తుందన్నారు. ప్రతి రైతు రైతుభరోసా కేంద్రాల ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మండల ఉద్యానశాఖ అధికారి సీహెచ్ జనని, ఏపీ ఎంఐపీ ఇంజినీర్ నాయక్, ఆయా గ్రామాల రైతు భరోసా ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో గల షెడ్‌నెట్ నర్సరీని జిల్లా ఉద్యానవనశాఖాధికారి బీ.జే.బెన్నీ గురువారం పరిశీలించారు. రైతులకు అందిస్తున్న మిరపనారును పరిశీలించి పలు సూచనలు అందించారు.

సత్తెనపల్లి: కొత్తగా వేసిన షెడ్ నెట్ నర్సరీదారులు ఆరోగ్యకరమైన, నాణ్యమైన మిరపనారును రైతులకు అందించాలని ఉద్యాన శాఖ పల్నాడు జిల్లా అధికారి బీజే బెన్నీ చెప్పారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల, కట్టమూరు, అబ్బూరు, కొమెరపూడి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీ చట్టం తప్పనిసరిగా పాటించాలని, నర్సరీకి సంబంధించిన రిజిస్టర్లు తప్పనిసరిగా పొందు పరచాలన్నారు.

టీటీడీకి ఎకరం భూమి కేటాయింపు



తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతినిధులకు భూమి పత్రాలు అందజేస్తున్న గ్రామ పెద్దలు

పెదకూరపాడు: పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు 75 త్యాళ్లూరు గ్రామంలో పూర్వ సమితి ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణానికి ఎకరం భూమి కేటాయించిన స్వాధీన పత్రాలను స్థానిక తహసీల్దార్ జియావుల్ హుక్, టీటీడీ ప్రాపర్టీ తహసీల్దార్ మధుసూదనరావుకు గురువారం ప్రజలు పత్రాలు అందజేశారు. రూ. 2 కోట్ల నిధులతో 75 త్యాళ్లూరు గ్రామంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించనున్నారు. దాతల వాటా ఇప్పటికే రూ. 40లక్షలు టీటీడీ వారికి చెల్లించారు. టీటీడీ ఏఈ జగన్‌మోహన్‌రావు, టి.బాలాజీ, సర్వేయర్ శివ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ సి.శ్రీనివాసరెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సచివాలయం సర్వేయర్ కోమలి, వీఆర్‌ఓ ప్రసాద్, జి.శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభం



పట్టణంలో మందులు కిట్లు అందుకున్న వారితో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని ప్రగతి డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పేదవానికి ఆరోగ్యమే మహాభాగ్యం అని ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయడంతో పేదవాడి ఆరోగ్యానికి మరింత భరోసా దక్కిందన్నారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష భరోసాగా నిలుస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఇది అమలవుతుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ షేక్ మహబూబ్ అలీ, డాక్టర్ గుజ్జర్లపూడి ధర్మసింగ్ శాస్త్రీ, డాక్టర్ అనూష, డాక్టర్ రాజేష్, డాక్టర్ అనిత లు 405 మందికి వైద్య పరీక్షలు నిర్వ హించారు. 15 మందికి ల్యాబ్ పరీక్షలు చేశారు. నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ అరుణకుమారి 104 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 33 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు.15 మంది నేత్ర కాటరాక్ట్ పరీక్షలకు రిఫర్ చేశారు. వైద్య శిబిరాన్ని కమిషనర్ కొలిమి షమ్మి పర్యవేక్షించారు. ఆయా కార్యక్రమాలల్లో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, డాక్టర్ మక్కెన అచ్చయ్య, కౌన్సిలర్లు అచ్యుత్ శివప్రసాద్, ఆకుల రమేష్, శెట్టి ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ మరియమ్మలు మాట్లాడారు. అనంతరం డాక్టర్ పి.గౌతమి, డాక్టర్ ఎం.అనుషా రాణి, డాక్టర్ షేక్ జబీర్, డాక్టర్ రవి శంకరా రెడ్డిలు 405 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం 13 మందిని రిఫర్ చేశారు. 806 మందికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ కాశీ 90 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 69 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. 12 మందికి నేత్రాల కాటరాక్ట్ పరీక్షలు నిమిత్తం రిఫర్ చేశారు. ఎంపీటీసీ నల్లగడ్డ మౌనిక, మాజీ సర్పంచ్ గోపిదేశి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ఆధునిక వైద్యం

అమరావతి: రాష్ట్రంలోని ప్రజలందరికీ వ్యాధుల పైన అవగాహన కల్పించి వైద్యసేవలు అందించటానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని వైకుంఠపురం సచివాలయ పరిధిలోని ఎంపీపీ స్కూల్లో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ ప్రజలందరికీ వారి ఇంటివద్దనే ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో తొలుత వ్యాధులపై అవగాహన, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్యసేవలు, ఉచిత మందుల పంపిణీ వంటి కార్యక్రమాలు వైద్య నిపుణుల పర్యవేక్షణలో నిర్వహిస్తారన్నారు. ఈకార్యక్రమంలో అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ మాట్లాడుతూ వైద్యాధికారులు తేజస్వినీ, రవిబాబు, హరిబాబు, గీతా కళ్యాణ్‌లు 523 మంది రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గుబ్బా కృష్ణయ్య,, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, మండల జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



అందుకూరులో వైద్యసేవలు అందిస్తున్న వైద్యుడు



వైకుంఠపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌ను అందజేస్తున్న దృశ్యం

అందుకూరులో...

అందుకూరు(క్రోసూరు): మండలంలోని అందుకూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరంలో గురువారం 479 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేయటం జరిగింది. వైద్యశిబిరంలో స్పెషాలిటీ వైద్యులు, కంటి వైద్యనిపుణులు డాక్టర్ కల్యాణ్, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ జి.ఇంద్రప్రసాద్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రమదేవి, డాక్టర్ బాలఅంకమ్మబాయి, డాక్టర్ సిరిచందన, డాక్టర్ మహ్మద్ సాద్, ఆరోగ్యవిస్తరణాధికారి శిఖా శ్యాంసన్ పాల్గొన్నారు. వైద్యశిబిరానికి విశేషంగా రోగులు హాజరై శిబిరాన్ని సద్వినియోగపరుచుకున్నారని ఈఓపీఆర్డీ పి.శివరామయ్య తెలిపారు.

రాజుపాలెం: మండలంలోని చౌటపాపాయపాలెం గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరంలో వైద్యాధికారులు డాక్టర్ సుష్మ, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కేవీ కృష్ణకుమార్, డాక్టర్ కిషోర్‌లు 305 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. 240 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. రక్త పరీక్షలలో ఇరువురికి డెంగీ, ఇరువురికి మలేరియా సూచించడంతో ప్రత్యేక మందులు ఇచ్చి సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. 106 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో ఏడుగురికి శస్త్ర చికిత్స అవసరం కావడంతో శంకర కంటి వైద్యశాలకు రిఫర్ చేశారు. సర్పంచ్ వల్లాల నాగరాజు, హెల్త్ సూపర్ వైజర్ ఉషారాణి, ఆశా, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లిలో...

అచ్చంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతపల్లి సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో 409మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 16 మంది విద్యార్థులు, 20 మంది గర్భవతులు, బాలింతలు ఉన్నారు. 192 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 141మందిని కళ్లజోళ్లకు ఎంపిక చేశారు. 22మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో వైద్యశాలలకు రిఫర్ చేశారు. మాదిపాడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ యం.ఇన్నారావు, డాక్టర్ రాంబాబు, స్పెషలిష్ట్ వైద్యులు డాక్టర్ ఎస్.ప్రేమ, డాక్టర్ ఎస్.గిరిరాజు తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించిన వారిలో ఉన్నారు. ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దమ్మాలపాడులో...

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. నిపుణులైన వైద్యులు అందించే వైద్యసేవలను పొందేందుకు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మొత్తం 802 మందికి వైద్యశిబిరంలో వైద్య సేవలందించినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమాదేవి తెలిపారు. 210 మందికి కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించారు. వైద్యులు వై.శ్రీనివాస్, నవ్య, సీహెచ్ ప్రసన్నకుమార్‌లు వైద్యసేవలందించారు. శిబిరాన్ని తహసీల్దార్ ఎం.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు కమిటీ వైస్ చైర్మన్ కళ్ళం శివరామిరెడ్డి, మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భూ రీ సర్వేను వెంటనే పూర్తి చేయండి



మాచర్ల: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వేను పట్టణంలో వెంటనే పూర్తి చేయాలని పురపాలక సంఘ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం రాష్ట్ర స్థాయిలో మున్సిపల్ పురపాలక సంఘ కమిషనర్లు, అధికారులతో సర్వే నిర్వహణపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఎక్కడా రాజీ పడవద్దని, నోటీసులు జారీ చేసి ప్రతి భూమిని సర్వే చేసి సంబంధిత పత్రాలను పరిశీలించి పూర్తి అర్హత కలిగిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. ఎటువంటి అవకతవకలకు అవకాశమివ్వకుండా సమగ్ర సర్వేను త్వరిగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత కమిషనర్లు, సర్వేయర్లపై ఉందన్నారు. మాచర్లలో పురపాలక సంఘ కమిషనర్ ఈవీ రమణబాబు, డీఈ మధుసూదనరావు, ఆయా సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.